క్లుప్తంగా

అభయాంజనేయస్వామికి విశేష పూజలు

రుద్రవరం: మండల పరిధిలోని రెడ్డిపల్లెలో సోమవారం అభయాంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆలయం నూతనంగా నిర్మించి విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠోత్సవం గావించి 41 రోజులు కావడంతో గ్రామ పెద్దలు వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ పెద్దలు సాంప్రదాయ దుస్తులతో ఆశీనులు కాగా వేద పండితులు శాస్త్రోక్తంగా హోమాది పూజా కార్యక్రమాలు చేయించారు.

కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే



కుష్టువ్యాధి నిర్ధారణకై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చాగలమర్రి: మండలంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి చికిత్సలు అందించేందుకు ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రిలోని 2వ వార్డులో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జులై 16వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు.

చాగలమర్రి తహసీల్దార్‌గా సుభద్రమ్మ



చాగలమర్రి: మండల తహసీల్దారుగా జి.సుభద్రమ్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పగిడ్యాల మండల డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న ఈమె పదోన్నతి పొంది బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్ కుమార్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు.

నిర్మాణాలు ప్రారంభించాలి

ఉయ్యాలవాడ : జగనన్న కాలనీలలో గృహాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని హౌసింగ్ డీఈ నాగరాజు సూచించారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో ఆర్.పాంపల్లె జగనన్న లేఅవుట్‌లో 44 మంది, ఇంజేడు 55, సర్వాయిపల్లె 43, ఉయ్యాలవాడ 127 గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు నిర్మాణాలు చేపట్టేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. మండల వైఎస్‌ఆర్‌సీపీ కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ నరసింహరావు, ఏపీఎం గురుస్వామి, వీఆర్‌ఓ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలను పరిష్కరిస్తాం



అర్చకుల సమస్యలు వింటున్న అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలోని దేవదాయ, ధర్మాదాయ శాఖలో పని చేస్తున్న అర్చకుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు 40 అర్జీలు ఇచ్చారన్నారు. అదే విధంగా ఇల్లు, స్థలం లేని అర్చకులు అర్జీ పెట్టుకుంటే త్వరితగతిన సమస్యలను పై అధికారులకు తెలిపి మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి శ్రీనివాసచార్యులు, తిరుమలయ్య, పార్థసారథి పాల్గొన్నారు.

పకడ్బందీగా భూరక్ష సర్వే

ఉయ్యాలవాడ : జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం కింద భూముల రీ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని రెండవ విడత ఎంపికైన గ్రామాల సచివాలయాల్లో రైతులతో కలిసి గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్స్ నంద్యాల జిల్లా క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): 8వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పెన్‌క్యాక్ షిలాట్ పోటీల్లో నంద్యాలజిల్లా పెన్‌క్యాక్ షిలాట్ క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు అసోసియేషన్ కార్యదర్శి మనోజ్‌సాయి, రాష్ట్ర ప్రెసిడెంట్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పుత్తూరులో 8వ పెన్‌క్యాక్ షిలాట్ పోటీలు ఆంధ్రప్రదేశ్ పెన్‌క్యాక్ షిలాట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు నంద్యాల జిల్లా నుంచి థ్యాండింగ్, తుంగల్ విభాగాల్లో క్రీడాకారులు పాల్గొని బంగారు, వెండి, రజిత పతకాలు, ప్రశంసా పత్రాలతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారని వివరించారు. భరద్వజ రెడ్డి, తదితరులు అభినందించారు.

శరవేగంగా గృహ నిర్మాణాలు

- నియోజక వర్గంలో 5,736 గృహాలు మంజూరు
- ఇప్పటికే 3,362 నిర్మాణాలు పూర్తి
- కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం
- గృహాలకు నీటి, విద్యుత్ కనెక్షన్లు



దీబగుంట్ల గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గృహాలు

నంద్యాల నియోజకవర్గంలో గృహ నిర్మాణాల వివరాలు..

మండలం	మంజూరైనవి	మొదలుకానివి	బిలో, అబోవ్ బేస్‌మెట్	రూఫ్ స్థాయి	పూర్తయినవి
గోస్పాడు	1258	28	248	85	366
నంద్యాల	1704	01	507	45	559
నంద్యాల అర్బన్	2774	00	280	51	1,072
మొత్తం	5,736	29	1,035	181	3,362

నంద్యాల(సిటీ): 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. గృహ నిర్మాణాలను చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తూ, సకాలంలో బిల్లులు చెల్లిస్తుండటం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గృహ నిర్మాణాలు ఊపందుకున్నాయి. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చకచకా విద్యుత్, నీటి సరఫరా కనెక్షన్లను మంజూరు చేస్తోంది.

1,310 గృహాలు వివిధ దశల్లో..

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద నియోజకవర్గ పరిధిలో 5,736 మంది పేద కుటుంబాలకు పక్కా నివాసాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పిస్తున్న విషయం తెలిసిందే. దీంతో వైఎస్సార్-జగనన్న కాలనీల రూపంలో ఏకంగా పట్టణాలే నిర్మితమవుతున్నాయి. 5,736 గృహాలకు గాను 3,362 గృహాలు పూర్తి కాగా మిగిలిన 1,310 నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

నంద్యాల జగనన్న లే అవుట్‌కు తొలగిన అడ్డంకులు..

నంద్యాల పట్టణంలోని పేద ప్రజలకు ప్రభుత్వం అందించే గృహాల నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించింది. అయితే టీడీపీ నాయకుల దాష్టీకంతో కోర్టులకు వెళ్లి లే అవుట్ పనుల్లో పురోగతికి అడ్డు పడ్డారు. అయితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మొట్టికాయలు వేస్తూ ఇచ్చిన తీర్పు ఆధారంగా ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి మొదటి దశలో సుమారుగా 3,006 మందికి పట్టాలను పంపిణీ చేశారు. అదేవిధంగా లే అవుట్ అభివృద్ధి కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

గతం కన్నా మిన్నగా..

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద పేదల ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని నిబంధనలను అనుసరిస్తోందని, నేషనల్ బిల్డింగ్ కోడ్-(ఎన్‌బీసీ), ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) నిబంధనలను కచ్చితంగా పాటిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఏబీసీ నిబంధనలతో పోలిస్తే ఎక్కువ విస్తీర్ణంలోనే ఇళ్లను కడుతోందని పేర్కొంటున్నారు. అలాగే గతంలో ప్రభుత్వాలు నిర్మించిన దాని కన్నా ఎక్కువ విస్తీర్ణంలోనే ఇళ్ల నిర్మాణం చేపడుతోందని గణాంకాలు చెబుతున్నాయి. అన్ని వసతులు ఉన్న పట్టణాల్లోని కాలనీల్లో 435.56 చదరపు అడుగుల స్థలంలో, గ్రామాల్లో 653.34 చదరపు అడుగుల స్థలంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తోంది.

22 లేఅవుట్లలో విద్యుత్ సర్వే పూర్తి

ఇంటి నిర్మాణాలు కొనసాగుతున్న 22 లేఅవుట్లలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన సర్వే పూర్తయింది. గోస్పాడు మండలంలో 12 లే అవుట్లలో సుమారుగా అన్ని లేఅవుట్లలో విద్యుత్ స్తంభాలు నాటడం, వైర్లు లాగడం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు లాంటి పనులు చకచకా కొనసాగుతున్నాయి. గోస్పాడు మండలం దీబగుంట్ల, చాపిరేవుల లేఅవుట్లలో పనులు పూర్తయ్యాయి. అదేవిధంగా నంద్యాల రూరల్‌కు సంబంధించి 10 జగనన్న లేఅవుట్లు ఉన్నాయి. ఇందులో కూడా నిర్మాణ పనులతో పాటు విద్యుత్ సర్వే పూర్తి చేయడంతో పాటు పనులు వేగంగా సాగుతున్నాయి. నంద్యాల అర్బన్‌లో ఉన్న ఒక్క జగనన్న లేఅవుట్‌లో పట్టాల పంపిణీ చేశారు. ఇతర పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

3,362 ఇళ్లకు విద్యుత్, నీటి కనెక్షన్లు

నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకూ 3362 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో 3,300 ఇళ్లకు విద్యుత్, 3,362 ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇచ్చారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్మాణాలు పూర్తయిన వెంటనే విద్యుత్, నీటి సరఫరా కనెక్షన్లు ఇచ్చేలా గృహ నిర్మాణ శాఖ చర్యలు చేపట్టింది.

వసతులపై ప్రత్యేక దృష్టి



వైఎస్సార్-జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాం. నిర్మాణం పూర్తయిన ప్రతి ఇంటికి వెంటనే నీరు, విద్యుత్ సరఫరా కనెక్షన్లు ఇస్తున్నాం. విద్యుత్ సిబ్బంది, లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణాలను పరిశీలన చేస్తున్నాం. అదేవిధంగా రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటున్నారు. అర్హులైన వారు కొత్తగా ఇళ్లు నిర్మించుకోవాలంటే సంబంధిత సచివాలాయల్లో దరఖాస్తులు చేసుకోవాలి.

– విజయ భాస్కర్ నాయుడు, గృహనిర్మాణ శాఖ పీడీ, నంద్యాల.

అద్దె బాధలు తప్పాయి



ఎన్నో రోజులుగా నంద్యాలలో అద్దె గృహంలో నివాసం ఉంటున్నాం. ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారలేదు. కానీ సచివాలయంలో గృహానికి దరఖాస్తు చేసుకున్నాను. ప్రభుత్వం నా పేరు మీద స్థలం ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి అవసరమైన రూ.1.80వేల ఆర్థిక సాయం అందించింది. ఇప్పుడు సొంత గృహంలో సంతోషంగా ఉన్నాం. – జైతున్ బీ, దేవనగర్ నంద్యాల.

రూ 10లక్షల విలువ చేసే స్థలం ఇచ్చారు



నంద్యాల మండలం కానాల గ్రామంలో గత 13 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. మాకు పక్కా ఇళ్లు లేదని గత ప్రభుత్వంలో పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నాం. కానీ స్థలం కానీ ఇళ్లు కానీ ఇవ్వలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక సుమారుగా రూ. 10లక్షల విలువ చేసే స్థలాన్ని ఇచ్చి అందులో పక్కా గృహాన్ని నిర్మించుకునేందుకు సహకారం అందించడం ఎంతో సంతోషంగా ఉంది.

– నజీర్ అహ్మద్, కానాల గ్రామం, నంద్యాల మండలం.

మాదకద్రవ్యాల వినియోగంతో ప్రపంచానికి ముప్పు

నంద్యాల(న్యూటౌన్): మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచానికి పెను ముప్పని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి అన్నారు. సోమవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో చైర్మన్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులతో అంతర్జాతీయ మాదక ద్రవ్య వినియోగ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ దాదాఖలందర్, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, డాక్టర్ గౌతమ్, లలితాసరస్వతి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

నంద్యాల(న్యూటౌన్): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు వాడకుండా ఉజ్వల భవిష్యత్తు కోసం పాటు పడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. సోమవారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ గంగన్న, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రుద్రవరం: ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్‌ఐ శరత్‌కుమార్ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి డ్రగ్స్ నిర్మూలనపై ఎస్‌ఐ తిరుపాల్ ర్యాలీ నిర్వహించారు.

ఉయ్యాలవాడ: యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

చాగలమర్రి: స్థానిక జెడ్పీ హెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం యం.కోటయ్య అధ్యక్షతన అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఎస్‌ఐ రమణయ్య అవగాహన సదస్సు నిర్వహించారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు ఇరిగెల తదితరులు

ఆత్మీయ కలయిక

ఆళ్లగడ్డ : ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, నారాయణ రెడ్డి, విశ్వనాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంగుల విజయ సింహారెడ్డిలతో కలిసి సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లిన వారు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అడిగిన పనులకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు.

వ్యక్తిపై రాళ్లతో దాడి

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని కొత్త ఎస్‌సీ కాలనీకి చెందిన కసినేని చిన్న ఓబులేసుపై అదే కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి ఇటుకలు, రాళ్లతో దాడి చేశాడు. కసినేని చిన్న ఓబులేసు నుదుటిపై తీవ్ర రక్త గాయమైంది. బాధితుడి భార్య పెద్దక్క తన ఇంటి వద్ద బోకులు కడిగిన నీళ్లు ఇంటి ముందున్న కాలువలో పారబోస్తుండగా, అటు వైపుగా వెళ్తున్న వెంకటేశ్వర్లు ఆ పాచి నీళ్లు నామీద పోస్తావా అంటూ వాగ్వాదానికి దిగాడు. ఇంతలో ఇంట్లో నుంచి ఓబులేసు రాగా అతనిపై రాళ్లతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన చిన్న ఓబులేసును పోలీసులు స్థానిక కెరళ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య పెద్దక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ హాస్టళ్లకు రూ.50వేలు కేటాయించాలి

నంద్యాల(న్యూటౌన్): సంక్షేమ హాస్టళ్ల మెయింటనెన్స్‌కు ఏడాదికి రూ.50వేలు కేటాయించాలని నంద్యాలలో ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

తాగు నీటి సమస్య పరిష్కారం

రుద్రవరం: మేజర్ పంచాయతీ రుద్రవరం బెస్త కాలనీలో పైప్‌లైన్ పనులు చేపట్టి తాగు నీటి సమస్యను పరిష్కరించినట్లు సర్పంచు విజయలక్ష్మి తెలిపారు. కొంత కాలంగా కాలనీలో పైప్‌లైన్ సక్రమంగా లేక తాగునీటి సమస్య ఉందన్నారు. కాలనీ వాసులు సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే పనులు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే సోమవారం జేసీబీతో మట్టి పనులు చేయించి కొత్త పైపులను అమర్చి కుళాయిలను ఏర్పాటు చేశామని చెప్పారు.

మహిళా హక్కుల కోసం పోరాటం

నంద్యాల(న్యూటౌన్): మహిళలకు విద్య, ఉపాధి సమాన అవకాశాలు కావాలని పోరాడిన సంఘం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలకు నంద్యాల వేదిక కానున్నట్లు వివరించారు. ఆగస్టు నెలలో 10వేల మంది మహిళలతో భారీ ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లాప్రధాన కార్యదర్శి సుగుణమ్మ, అధ్యక్షులు నారాయణమ్మ, జయలక్ష్మి, లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

ఆళ్లగడ్డ : రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులు రైతులకు అందుబాటులో ఉంటూ నిరంతరం వారికి సేవలు అందించాలని ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, ఆర్బీకే ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటల ఉత్పత్తుల పెంపుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుదామన్నారు.

అన్నదాతను రాజును చేసిన ప్రభుత్వం



పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ : వ్యవసాయానికి పెద్ద పీట వేస్తూ రైతును రాజు చేస్తున్న ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మద్దతు ధరకు పసుపు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి దొరకడం అదృష్టమన్నారు. నాడు చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే నేడు తమ ప్రభుత్వం దానిని పండగ చేసిందన్నారు. పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్‌మెన్ గంధం రాఘవరెడ్డి, జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ నాగరాజు, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, ఏడీఏ రామ్మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతు నిజాయితీ



నగదుతో ఉన్న బ్యాగును పోలీసులకు అందిస్తున్న రైతు మల్లేశ్వర్

బొమ్మలసత్రం: మహానంది మండలానికి చెందిన ఓ రైతు నిజాయితీకి పోలీసులు ఫిదా అయ్యారు. మహానంది మండలం పుట్టుపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వర్ అనే రైతు తన భార్యతో కలిసి సోమవారం ఉదయం బైక్‌పై వచ్చాడు. ఫరూక్ నగర్ వద్ద ఒక బ్యాగు తనకు కనిపించడంతో బైక్ ఆపి బ్యాగ్ తీసుకున్నాడు. అందులో రూ.40 వేలు నగదు కనిపించింది. వెంటనే ట్రాఫిక్ పోలీస్టేషన్ వద్దకు వెళ్లి తనకు దొరికిన బ్యాగును పోగొట్టుకున్న బాధితులకు అందించాలని కోరాడు. ట్రాఫిక్ ఎస్సై దేవేంద్ర.. వన్‌టౌన్ సీఐ రామకృష్ణ, ఎస్సై సుబ్బిరామిరెడ్డికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని నగదుతో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. బాధితులను గుర్తించి నగదు తిరిగి అందజేస్తామని రైతు మల్లేశ్వర్‌కు హామీ ఇచ్చారు.

దివ్యాంగులకు స్థలాలు కేటాయించాలి

నంద్యాల(అర్బన్): జగనన్న కాలనీల్లో అర్హులైన దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించి డీఆర్‌ఓ పుల్లయ్యకు అసోసియేషన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మానవతా హృదయంతో పెన్షన్‌ను రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, ఎల్లయ్య, బాషా, నబిరసూల్, వేణుగోపాల్, శ్రీనివాసులు, చెన్నయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థిని చదువుకు చేయూత

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల ఎంపీపీ(స్పెషల్) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పేద విద్యార్థిని మహిజాబీన్ చదువు కోసం రూ.10వేల విలువ చేసే స్టడీమెటీరియల్‌ను సీనియర్ న్యాయవాది రామచంద్రరావు చేతులు మీదుగా అందజేశారు. ప్రస్తుతం ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలిక ఉన్నత చదువులు చదివి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలి ఆకాంక్షించారు.

సామాజిక స్పృహ ఉన్న సినిమాలు తీయాలి

నంద్యాల(అర్బన్): దర్శకులు, నిర్మాతలు సామాజిక స్పృహ కలిగిన చిత్రాలను మాత్రమే తీయాలని, రాజకీయ నాయకులను కించ పరిచేలా సినిమాలు తీస్తే ఆదరణ ఉండదని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్శకుడు రాంగోపాల్ వర్మ తీసిన వ్యూహం సినిమాలో కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే కార్యకర్తలు ఊరుకోరన్నారు. నాయకులు చింతలయ్య, ఎస్‌వైడీ ప్రసాద్, ఆనందరావు, రవిబాబు, మాబుసా, పెద్దన్న పాల్గొన్నారు.

ఉచిత విద్యనందించాలి

నంద్యాల(న్యూటౌన్): కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను ప్రభుత్వం అందించాలని కోరుతూ సోమవారం డీఈఓ సుధాకర్‌రెడ్డికి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ జిల్లా పరిషత్ మున్సిపల్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని, విద్యాకానుక కిట్లు విద్యార్థులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని, టీచర్ పోస్టులను కుదించే జీవోను రద్దు చేయాలని, 3, 4, 5 తరగతుల విలీనాన్ని నిలిపి వేయాలని కోరారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు షాహీర్, వినోద్, బాషా పాల్గొన్నారు.

దళారులు లేకుండా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- గోస్పాడు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

గోస్పాడు: ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంలో మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలందరికీ అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సత్యనారాయణపురం, తెల్లపురి గ్రామాలలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరును వివరిస్తూ, స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా చిన్నచిన్న సమస్యలు తప్పా చాలా వరకు పరిష్కారం అయ్యాయని తెలిపారు. అలాగే మధ్యవర్తులు, దళారులు లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాల నగదు తమ ఖాతాలలోకే పడుతున్నాయని మహిళలు ప్రభుత్వ పాలనా పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ప్రహ్లాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిలతో కార్యాలయంలోని చైర్‌పర్సన్ ఛాంబర్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనుల పై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ రమణ మూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

జగజ్జననీకి సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): జగజ్జననీ మాతకు సోమవారం భక్తులు పెద్ద ఎత్తున మేళతాళాలతో సారెను సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

చాగలమర్రి: గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మిదేవి సూచించారు. మండలంలోని శెట్టివీడు గ్రామ సచివాలయాన్ని సోమవారం సందర్శించారు. గ్రామ ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి , పంచాయితీ కార్యదర్శి స్వప్న తదితరులున్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోండి

చాగలమర్రి: మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని స్థానిక ఎస్‌ఐ రమణయ్య సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ ఖాజీ ముల్లా యూనుస్, హనీఫ్, గుత్తి నరసింహులు, జగదీశ్వర రెడ్డి తదితరులున్నారు.

చాగలమర్రిలో చోరీ

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని శ్రీనివాస నగర్ కాలనీలో నివాసం వుంటున్న చెన్నయ్య అనే వ్యక్తి ఇంట్లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు స్థానిక ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. బాధితుడు ఇంటికి తాళాలు వేసి వూరికి వెళ్లి ఆదివారం తిరిగి వచ్చాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. రూ.60,000ల విలువ చేసే 2 తులాల కమ్మలు, 4 ఉంగరాలు చోరీకి గురైనట్లు భాదితుడు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

గోస్పాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ అబ్దుల్‌కరీం అన్నారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను సక్రమంగా జరిగేలా చూడాలని, త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు.

నేడు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నాలుగు కంపెనీల్లో పనిచేయుటకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారి పీవీ ప్రతాపరెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9.30గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఎంబీఏ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు www.apssdc.in సంప్రదించాలన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు.

ఏజీపీగా జగన్‌మోహన్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది నూకా జగన్‌మోహన్‌రెడ్డి ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ న్యాయ శాసన సభ సెక్రటరీ సత్యప్రభాకర్‌రావు నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి. ఆయన మాట్లాడుతూ ఏజీపీగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సెకండ్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ ప్లీడర్‌గా ప్రభుత్వం సంబంధించిన కేసులను వాదించడానికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.